# నూతన జాతీయ పునరావాస విధానం

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వ సామాజిక విధానంలో గణనీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 1990లలో ప్రారంభించిన నూతన ఆర్థిక విధానం సరళీకరణ, ప్రైవేటీకరణకు పెద్దపీట వేసింది. దేశ వ్యాప్తంగా ప్రత్యేక ఆర్థిక మండళ్లు (Special Economic Zones) కోసం ఇప్పటి వరకు 1.25 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిని సేకరించారు.

దురదృష్టవశాత్తు, ఈ ఆర్థిక మండళ్లు రియల్ ఎస్టేట్ మండళ్లుగా మారుతున్నాయి. దేశంలో 65 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. పారిశ్రామికీకరణ వ్యవసాయానికి అనుబంధం కావాలి కానీ, వ్యవసాయం పారిశ్రా మికీకరణకు అనుబంధం కానవసరం లేదు. మార్కెట్ ప్ర భావిత ప్రభుత్వ విధానాలు జాతీయాభివృద్ధికి దోహదం చేశాయనేది వాస్తవమైనా, దాని ఫలాలు సమాజంలోని ధనిక వర్గాలు, బహుళజాతి సంస్థలకు మాత్రమే చేరుతున్నాయనే విమర్శ నెలకొంది. పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, నీటి పారుదల, విద్యుత్ శక్తి ఉత్పత్తి కోసం డామ్‌ల నిర్మాణం వంటి వాటి వల్ల కోట్ల మంది ప్రజలు నిర్వాసితులు అవుతున్నారు. వారికి సరైన పునరావాసం కల్పించకపోవడంతో వారు పుట్టి పెరిగిన స్థలంలోనే కాందిశీకులుగా మారాల్సి వస్తోంది. కేవలం 25 శాతం మందికి మాత్రమే పునరావాసం కల్పించారని, మిగిలిన వారి పరిస్థితి దయనీయంగా ఉందని మేథాపాట్కర్ వంటి ఉద్యమకారుల అభిప్రాయం.

నూతన ఆర్థిక విధానం కారణంగా ఎక్కువ నష్టపోతున్నవారు – షెడ్యూల్డు కులాలు, తెగలు. దేశవ్యాప్తంగా ప్రారంభమైన నిరసన ఉద్యమాల నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం 2003లో మొదటిసారిగా జాతీయ పునరావాస విధానాన్ని ప్రకటించింది. వేల కుటుంబాలను దారిద్ర్య రేఖ దిగువకు నెట్టివేయడంతోపాటు పర్యావరణపరంగా కూడా జాతీయ ప్రయోజనాలకు భంగం కల్గిస్తుందని పలు స్వచ్ఛంద సేవాసంస్థలు ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో.. 2007వ సంవత్సరంలో కేంద్రప్రభుత్వం నూతన జాతీయ పునరావాస విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం, ఒక వైపు పారిశ్రామిక అవసరాలను,మరో కవైపు భూమిహక్కుదార్ల, కౌలుదార్ల, వ్యవసాయ కూలీల, ఇతర సాధారణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిందని అధికార వర్గాల వాదన. ప్రాజెక్టుల (ఆర్థిక మండళ్లతో సహా) ఏర్పాటు వల్ల నష్ట పోయే కుటుంబాలకు న్యాయబద్ధమైన పరిహారం చెల్లి స్తుంది. వృద్ధులు, వికలాంగులు, అనాథలు, వితంతువులు, అవివాహిత స్త్రీలు నెలసరి పింఛనుకు అర్హులు. ప్రాజెక్టుల వల్ల భూములను కోల్పోయిన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వారికి సమానమైన భూమిని ప్రభుత్వం ఇస్తుంది. అర్హతలను, ఖాళీలను దృష్టిలో పెట్టుకొని నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని కల్పిస్తారు. నిర్వాసిత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తారు. స్వయం ఉపాధి పథకాల అమలు, వృత్తిపరమైన



శిక్షణ, ఉచిత గృహ నిర్మాణం తదితర సౌకర్యాలు లభిస్తాయి. నిర్వాసితుల క్లేశ నివారణకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన పునరావాస కమిషన్‌ను నియమిస్తారు. దీన్ని చట్టబ ద్ధం చేయడానికి 2008లో పార్లమెంట్‌లో జాతీయ పునరా వాస బిల్లును ప్రవేశపెట్టారు. అంతేకాకుండా భూసేకరణ చట్టాన్ని (1894) సవరిస్తూ 2009లో ఒక బిల్లును పార్ల మెంట్‌లో ప్రవేశపెట్టారు.

## పునరావాస విధాన సమీక్ష:

పునరావాస విధానాన్ని రూపొందించేటప్పుడు పౌర సమా జాన్ని విశ్వాసంలోకి తీసుకోకపోవడం ప్రధాన లోపం. ప్రజా ప్రయోజనాల కోసం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. కానీ హక్కుదారులను, భుక్తిదారులను సంప్రదించి, వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి. భూసేకరణకు చట్టబద్ధత కల్పించినప్పటికీ, నిర్వాసితుల పునరావాసానికి ఎటువంటి చట్టబద్ధతలేదు. ప్రభుత్వ చేయూత మీదే వారి పునరావాసం ఆధారపడి ఉంది. రాజ్యాంగంలోని 21వ ప్రకరణ మేరకు ప్రజలకు జీవించే హక్కు ఉంది. నిర్వాసితుల పునరావాసం ఇందులో అంతర్భాగం.

పునరావాస విధానం మూడు ప్రధానాంశాలను ప్రస్తా విస్తోంది. అవి..

- నిర్వాసితులను (Displacements) పరిమితం చేయాలి.
- భూసేకరణను పరిమితం చేయాలి.
- వ్యవసాయిక భూమిని వ్యవసాయేతర కార్యకలాపాలకు వినియోగించడాన్ని పరిమితం చేయాలి.

కానీ ఆచరణలో ఈ లక్ష్యాలకు భిన్నంగా జరుగుతోంది. ముంబై పరిసరాల్లో 14,000 హెక్టార్ల వ్యవసాయ భూమిని ప్రత్యేక ఆర్థిక మండళ్ల కోసం కేటాయించారు. ఒక్క రిలయన్స్ కంపెనీ చేతిలోనే 60,000 ఎకరాలు ప్రత్యేక ఆర్థిక మండళ్ల రూపంలో ఉన్నదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఎకరాల భూమిని కారు చౌకగా కొని (ఆర్థిక మండళ్ల ఏర్పాటు నెపంతో) మీటర్లలో అత్యధిక ధరలకు అమ్ముకుంటున్నారు. నవీ ముంబైలో చదరపు మీట రు భూమి ఖరీదు రూ. 55000 – 75000గా ఉంది. మిలియన్ల కొద్దీ గ్రామీణ ప్రజలు నిర్వాసితులై పొట్ట చేతబట్టు కుని బతుకుదెరువు కోసం పట్టణాలకు

SAKSHI

వచ్చి మురికి వాడలలో మగ్గిపోతుంటే, పట్టణాల్లోని సంపన్నవర్గాలకు క్లబ్బులు, విలాస గృహాలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, బహుళ జాతి సంస్థల కార్పొరేట్ కార్యాలయాల కోసం విలువైన వ్యవసాయ భూమిని త్యాగం చేయడం ఎంతవరకు స మంజసం? ఒక ప్రాజెక్టు కోసం సేకరించిన భూమిని, ఆ ప్రాజెక్టు ఏర్పాటుకాకపోతే ఎలా విని యోగించుకుంటారు. పశ్చిమ బెంగాల్‌లోని సింగూర్‌లో టాటా మోటార్స్ కోసం సేకరించిన 997 ఎకరాల భూమి పరిస్థితి ఏమిటి? టాటా కంపెనీ ఆ ప్రాజెక్టును 2008లో విరమించుకుంది. పార్లమెంటు లో ఇటీవల ప్రవేశపెట్టిన భూ సేకరణ బిల్లులోను ఈ సమస్యకు జవాబు లేదు.

పునరావాస విధానాన్ని సమీక్షించడానికి అయిదు ప్రధాన అంశాల ను పరిగణించడం ఉపయుక్తం. అవి..

- ఏ మేరకు నిర్వాసితను తగ్గిస్తుంది?
- ప్రాజెక్టుల ఏర్పాటు వల్ల జరిగే నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయడం జరుగుతుందా?
- నిర్వాసితులకు ఇచ్చే నష్ట పరిహారం న్యాయ బద్ధమేనా?
- మానవతా దృక్పథంతో పునరావాస విధానం రూపొందిందా?
- సంతృప్తికరంగా అమలు చేయడానికి సమగ్ర నిబంధనలు రూపొందించారా?

ప్రస్తుతం అనుసరించే పునరావాస విధానం, దురదృ ష్టవశాత్తు, పైన సూచించిన ఐదు అంశాల విషయంలో లోపభూయిష్టమే. స్వచ్ఛంద సేవా సంస్థల చొరవతో రూపొందించిన 'జాతీయ ప్రగతి, నిర్వాసిత, పునరా వాస' (National Development and Rehabilitation Policy Draft) ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం పునరా వాస విధాన రూపకల్పన చేసినప్పుడు దాదాపు విస్మరించినట్లుంది.

## సూచనలు:

మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రైవేట్ ఆస్తిని (భూమి) స్వాధీనం చేసుకోవాల్సి వస్తుంది. దీని వల్ల ఎందరో ప్రజలు తమ జీవనోపాధి, వసతి కోల్పోవడం జరుగుతుంది. ఈ పరిణామా లు ప్రజల మనోస్థైర్యాలను దెబ్బ తీస్తాయి. సామాజిక, సాంస్కృతిక దుష్పరిణా మాలు సంభవిస్తాయి. కాబట్టి భూమిని స్వాధీనం చేసుకొ నేటప్పుడు... పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు..

- సమగ్ర పునరావాస విధానాన్ని రూపొందించాలి. అవసరాన్ని బట్టి నిర్వాసితుల పట్ల ప్రభుత్వం మరింత ఉదారంగా వ్యవహరించాలి.
- విధానాలను రూపొందించేటప్పుడు ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నష్టపోయే ప్రజలను సంప్రదించి వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి.
- భూమి కోల్పోయిన వారితో పాటు, ఆ భూమి మీద ఆధారపడే (వ్యవసాయ కూలీలు) వారికి కూడా నష్టపరిహారం చెల్లించాలి.
- నిర్వాసిత ప్రజలకు ఆర్థికంగా, పర్యావరణ పరంగా, సామాజిక పరంగా, సాంస్కృతిక పరంగా సంభవించే దుష్పరిణామాలను పారదర్శకంగా అంచనా వేయాలి.
- బలవంత నిర్వాసితానికి (Involuntary displacement) గురయ్యే పరిస్థితుల్లో వీలైనంతవరకు నిర్వాసితాన్ని తగ్గించడం; ప్రత్యామ్నాయ పథకాలను పరిశీలించడం.
- సామాజిక ప్రభావాన్ని (Social impact) అంచనా వేయడం తప్పనిసరి.
- నిర్ణీత గడువులో పునరావాస కార్యక్రమాన్ని అమలు చేయడం.
- పునరావాస కార్యక్రమ సక్రమ అమలు కోసం తగిన యంత్రాంగాన్ని రూపొందించడం, క్లేశ నివారణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం.
- బలవంతంగా నిర్వాసితులయ్యే కుటుంబాలు, మైదాన ప్రాంతాల్లో 400, కొండ ప్రాంతాల్లో 200లకు పైగా ఉంటే సామాజిక ప్రభావ నిర్ధారణ కోసం (Social Impact Assessment) స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన బహుసభ్య సంఘం పరిశీలించాలి.
- నిర్ణీత కాలంలో సామాజిక ప్రభావ నిర్ధారణ వ్యవస్థ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదా తిరస్కరించడం జరగాలి.
- జిల్లా కలెక్టర్ హోదాకు తక్కువ కాని అధికారిని పునరావాస కమిషనర్/పాలకునిగా నియమించడం; ఈ అధికారి నిర్వాసితులతో చర్చించి వారి పునరావాసానికి తగిన చర్యలు తీసుకోవాలి; అవి... నిర్వాసిత ప్రాంత వివరాలను కనీసం మూడు వార్తా పత్రికల్లో ప్రకటించడం. సర్వే జరపడం, సర్వే ఫలితాలను ప్రకటించి, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం; 30 రోజుల్లో నివేదిక రూపొందించడం; ప్రభుత్వం 45 రోజుల లోపు తగిన నిర్ణయాలను తీసుకోవడం; పునరావాస పథకాన్ని స్థానికులతో చర్చించడం.

**పునరావాస కార్యక్రమం కింద ఈ సదుపాయాలు కల్పించాలి :**

- కోల్పోయిన భూమికి సమానంగా ప్రత్యామ్నాయ భూమిని ఇవ్వడం.
- స్వయం ఉపాధి కోసం శిక్షణనివ్వడం.
- విద్యార్థులకు ఉపకార వేతనాలు.
- తాత్కాలిక వసతి సౌకర్యాలకు ధన సహాయం.
- భూమి లేని పేదలకు ఉచిత గృహ నిర్మాణం
- 50ఏళ్ల దాటిన వారికి, ప్రత్యామ్నాయ భృతి లేనివారికి పింఛను సౌకర్యం.

ఇవేకాక.. క్లేశ నివారణకు పటిష్ట యంత్రాంగాన్ని ఏ ర్పాటు చేయడంతోపాటు అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటు, పునరావాస పథకాల అమలును సామాజిక తనిఖీ చేయడం, ఇతర సంరక్షణ చర్యలు తీసుకోవాలి.

**ముఖ్యాంశాలు:**

- దేశంలో ఎస్ఈజెడ్‌ల ఏర్పాటు కోసం ఇప్పటి వరకు 1.25 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిని సేకరించారు.
- మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం 2003లో జాతీయ పునరావాస విధానాన్ని ప్రకటించింది.

- 2007వ సంవత్సరంలో కేంద్రప్రభుత్వం నూతన జాతీయ పునరావాస విధానాన్ని ప్రకటించింది.
- 2008లో పార్లమెంట్‌లో జాతీయ పునరావాస బిల్లును ప్రవేశపెట్టారు.
- భూసేకరణ చట్టాన్ని (1894) సవరిస్తూ 2009లో ఒక బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.
- అర్హతలను, ఖాళీలను దృష్టిలోపెట్టుకొని నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని కల్పిస్తారు.
- రాజ్యాంగంలోని 21వ ప్రకరణ మేరకు ప్రజలకు జీవించే హక్కు ఉంది. నిర్వాసితుల పునరావాసం ఇందులో అంతర్భాగం.
- ఒక్క రిలయన్స్ కంపెనీ ఆధీనంలోనే ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరిట 60 వేల ఎకరాల భూమి ఉంది.
- 'జాతీయ ప్రగతి, నిర్వాసిత, పునరావాస' (National Development and Rehabilit- ation Policy Draft) ముసాయిదాను కేంద్ర ప్రభు త్వం పునరావాస విధాన రూపకల్పన చేసినప్పుడు దాదాపు విస్మరించినట్లుంది.
- ప్రాజెక్టుల వల్ల భూములను కోల్పోయిన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వారికి సమానమైన భూమిని ప్రభుత్వం ఇస్తుంది.

SAKSHI